


'ఏపీఈఆర్‌సెట్' కన్వీనర్ గా ఆచార్య దేవప్రసాద్ రాజు



ప్రజాశక్తి - క్యాంపస్ ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి ప్రతి సంవత్సరం నిర్వహించే రీసెట్‌ను 2023 సంవత్సరానికి గాను శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి ఇచ్చింది. ఈ సెట్ ను నిర్వహించే కన్వీనర్ బాధ్యతలను యస్వీయూ భౌతికశాస్త్ర ఆచార్యులైన డా. దేవప్రసాద్ రాజు కు అప్పగిస్తూ నియామక పత్రం జారీచేసింది. ఈ మేరకు నియామక పత్రాన్ని గురువారం ఎస్వీయూ ఉపకులపతి ఆచార్య కె. రాజారెడ్డి , రిజిస్ట్రార్ ఆచార్య మహమ్మద్ హుస్సేన్ లు ఆచార్య దేవప్రసాద్ రాజుకు అందజేశారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ పరీక్ష నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఎస్వీయూకు రీసెట్ 2023 నిర్వహణాబాధ్యతలు అప్పగించిన ఉన్నత విద్యామండలికి కతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు కన్వీనర్ బాధ్యతలు అప్పగించిన విశ్వవిద్యాలయం అధికారులకు , ఉన్నత విద్యామండలికి ఆచార్య దేవప్రసాద్ రాజు ధన్యవాదాలు తెలిపారు.

పస్తులతోనే 'శ్రీవారి' దర్శనం

- వైకుంఠంలో శుభ్రత కరువు
- సామాన్యులంటే టిటిడికి అలుసా..!

ధర్మోరక్షతి రక్షితః..... భక్తులకు అత్యుత్తమ సౌకర్యాల కల్పనే టిటిడి ధ్యేయం... సామాన్యులకే పెద్దపీట...టిటిడిలో విధులు ఉద్యోగం కాదు సేవ... అంటూ తరచూ వల్లెవేసే తిరుమల తిరుపతి దేవస్థానం, అసలు సామాన్యుడిని పట్టించుకోకపోవడం గమనార్హం. క్యూలైన్లో వేచి ఉండే భక్తులకు ఆహారం అందజేస్తే ఒట్టు. కనీసం వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లలో పరిశుభ్రత విషయాన్ని విస్మరించింది. ధర్మాన్ని కాపాడు...ఆ ధర్మమే నిన్ను రక్షిస్తుందని చెప్పుకునే ఉన్నతాధికారులకు ఇది 'ధర్మ'మా అని ఆలోచించాలి.



ప్రజాశక్తి-తిరుపతి సిటి

ప్రపంచంలోనే అత్యంత కుబేర ఆధ్యాత్మిక సంస్థ టిటిడి. టిటిడి మొత్తం సామాన్యులు హుండీద్వారా వేసే కానుకలు, తలనీలాలు ద్వారా వచ్చే ఆదాయంతోనే అధికభాగం నడుస్తోంది. రోజుకు కేవలం హుండీద్వారా వచ్చే ఆదాయమే టిటిడి అధికారుల లెక్కల ప్రకారం కనీసం 4 కోట్ల రూపాయలు పైమాటే. ఇక తలనీలాలు, అద్దె గదుల ఆదాయం, తులాభారం లెక్కలు వేరే. ఇవన్నీ సామాన్యుడి నుంచి వచ్చే ఆదాయమే. వివిఐపి బ్రేక్ దర్శనం, శ్రీవాణి ట్రస్టు, సిఫార్సు లేఖలు, శ్రీవారి నిత్య సేవలు ద్వారా వచ్చే ఆదాయం డబ్బున్నవారి వద్ద నుంచి వచ్చేది. సామాన్యుల నుంచి నెలకు కనీసం అంటే 300 కోట్ల రూపాయలు టిటిడి ఆదాయం సమకూర్చుతుంది. కానీ అందులో సగభాగం కూడా వారి సౌకర్యాలకు కల్పించడం లేదన్నది భక్తుల ఆవేదన. గత కొంత కాలంగా సామాన్యుడంటే టిటిడికి మరీ చులకనభావంగా కనిపిస్తోంది.

గతంలో వైకుంఠం క్యూకాంప్లెక్ ద్వారా శ్రీవారి దర్శనానికి వచ్చే సర్వదర్శనం భక్తులు, 300 రూపాయల ద్వారా వచ్చే భక్తులు, టైమ్‌స్లాట్ టోకన్ల ద్వారా వచ్చే సామాన్య భక్తులకు వైకుంఠంలో వేచి ఉండే సమయంలో సాంబారు అన్నం, పెరుగు అన్నం, ఉప్మా, పొంగలి, పాలు, తదితర ఆహార పదార్ధాలు క్రమం తప్పకుండా అందించే వారు. ఇప్పుడు ఆ ఊసే లేదు. క్యూలైన్లలో ఆహార పంపిణీ లేకపోవడంతో భక్తులు ఆకలితో అలమటిస్తూనే స్వామివారి దర్శనం చేసుకుంటున్నారు. పైగా క్యూకాంప్లెక్స్‌లోకి బయట వస్తువులు వచ్చి బిస్కెట్లు, చిప్స్ విక్రయిస్తుండడం గమనార్హం. వైకుంఠంలోని ఏర్పాటు చేసిన టీవీల్లో భక్తిపాటలు, చిత్రాలు వేసేవారు. ఇప్పుడు అధికభాగం టీవీలు అసలు పనే చేయడం లేదు. క్యూకాంప్లెక్స్‌లో మరుగుదొడ్ల శుభ్రతపై టిటిడి శీతకన్ను వేసింది. అరకొర సిబ్బంది ఏర్పాటు చేసి తూతూమంత్రంగా క్లీన్ చేయిస్తుండడంతో మరుగుదొడ్లు దుర్వాసన కొడుతున్నాయి. పైగా వాటికి నీటి సరఫరా కూడా సక్రమంగా లేదన్నది భక్తుల ఆవేదన. ఆఖరికి దర్శనానికి వెళ్లే భక్తులకు క్యూ కాంప్లెక్స్ ప్రవేశ మార్గంలో, కాంప్లెక్స్‌లో, దొడ్లలో ఎన్నిగంటలకు దర్శనం అవుతుంది. దొడ్లు ఎప్పుడు ఓపెన్ చేస్తారు. తదితర వివరాలతో డిసిప్లే చేసేవారు. ఇప్పుడు ఆ మాటే లేదు. లోపలికి వెళ్లితే అక్కడి అధికారుల దయాదాక్షిణాలపై ఆదారపడి దర్శన సమయం ఉంటోంది.

అపర కుబేరుడైన శ్రీవేంకటేశ్వర స్వామిని మరింత కుబేరుని చేయాలని తలిచేదేమో. డబ్బున్న వారికే పెద్దపీట వేస్తూ, సామాన్యుడిని కనీసం పట్టించుకోకపోవడం గమనార్హం. ఇంత అవస్థలు పడి సామాన్యుడు స్వామి దర్శనానికి వెళ్లితే రెప్పపాటు కాలం కూడా మహాలఘులోనే చూసుకోవాలి. ఇది సామాన్యుడి పరిస్థితి. సామాన్యుడిని పట్టించుకోకపోవడం టిటిడి ఉన్నతాధికారులకు 'ధర్మ'మా..? ఇప్పటికైనా వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో కనీస సౌకర్యాలు మెరుగు పరిచి, సామాన్యుడికి ఆహారాన్ని అందించి, స్వామి దర్శనం కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సామాన్య భక్తులు కోరుతున్నారు.

స్వామిని దగ్గర నుంచి చూపిస్తే చాలు : రఘునాథ్

స్వామివారి దర్శనానికి వెళ్లిన వారిని క్యూలైన్లో అన్నం, నీళ్లు ఇవ్వకపోయినా పర్వాలేదు. గంటల తరబడి వేచి ఉండేలా చేసినా సరే. కానీ స్వామివారిని దూరం నుంచి చూపించి రెప్పపాటు కాలంలోనే లాగేయడం దారుణం. టిటిడి సౌకర్యాలు కల్పించకపోయినా పర్వాలేదు. కనీసం స్వామివారిని వీలైనంత తక్కువ దూరం నుంచి చూపించేలా చర్యలు తీసుకోవాలి.

డబ్బున్నోళ్లకే శ్రీవారు : రవి



ఏదారి పేదవాడు భక్తితో పూజలు చేసుకుని రోజుల తరబడి సుదూరం ప్రయాణించి, గంటల తరబడి క్యూలైన్లో వేచి ఉండే పేదవారికి, సామాన్య భక్తులకు స్వామివారి దర్శనం క్షణకాలమే...అది కూడా దూరం నుంచే. అదే డబ్బున్నోళ్లకి 10వేలు కడితే చాలు. కేవలం అర్ధగంటలో దర్శనం, అదీ కూడా గర్భగుడి సమీపంలో కొద్దిసేపు నిల్చొబెట్టి దర్శనం చేయిస్తారు.


బాతురూమ్‌కు వెళితే గబ్బుగబ్బు : సురేష్, నెల్లూరు



రెండు రోజుల క్రితం శ్రీవెంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లాను. సుమారు 8 గంటలకు పైగా క్యూలో వేచి ఉన్నాం. బాతురూమ్ అర్జెంట్ కావడంతో క్యూలైన్లో ఉన్న మరుగుదొడ్లకు వెళ్లితే కంపుకొడుతున్నాయి. నీళ్ల సరఫరా కూడా సక్రమంగా లేదు. ముందే కరోనా మూడో విడత విజృంభిస్తోందని ప్రజలు భయపడుతున్నారు. ఇలాంటి తరుణంలోనూ శుభ్రత విషయంలో టిటిడి విఫలమవుటాటు ఉండడం సరైనది కాదు.

పసిపిల్లలు ఆకలితో అలమటించారు

మహేంద్ర, బెంగుళూరు



రెండు రోజుల క్రితం స్వామి దర్శనానికి కుటుంబ సమేతంగా వెళ్లాం. కుటుంబం మొత్తం 10 మందిమి. అందులో ముగ్గురు చంటిపిల్లలు ఉన్నారు. క్యూలైన్లో ఏడు గంటలపైగానే ఉన్నాం. ఉదయం అనగా వెళ్లిన మాకు సాయంత్రం వరకు దర్శనం కాలేదు. పిల్లలు ఆకలితో కేకలు వేశారు. కనీసం పాలు కూడా క్యూలైన్లో ఇవ్వలేదు. ఎలాగోలా వారిని ఓదార్చి సాయంత్రానికి స్వామి దర్శనం చేసుకుని బయటపడ్డాం. టిటిడికి అంత ఆదాయం వస్తే సేవా కార్యక్రమాలను మరచినట్లు అన్నప్రసాదాలు పెట్టడం మానేసింది. పరిశుభ్రతను విస్మరించింది.

శ్రీవారిని ధనికుల దేవుడుగా మార్చొద్దు : సిఐటియు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు, యాజమాన్యం తిరుమల వెంకన్నను ధనికులదేవుడుగా మార్చాలని ప్రయత్నిస్తున్నట్లుందని ఈ వైఖరిని తక్షణం మార్చుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఇటీవల తిరుమల కొండపై అతిథి గహాలకు పెంచిన ధరలు సామాన్య యాత్రికులను విస్మయానికి గురి చేశాయని ఆరోపించారు. కొన్ని అతిథి గహాలలో 2వేలకు పైగా ధర పెంచేయడం ఎంతవరకు న్యాయమని ఆయన ప్రశ్నించారు. సౌకర్యాలు పెంచామనే పేరుతో సామాన్యులకు కేటాయించబడ్డ అతిథి గహాలను డబ్బున్న వారికి అమ్మకానికి పెట్టినట్టుగా తయారైందని, ఈ ధోరణి ఏమాత్రం సమంజసం కాదని ఆయన హితవు చెప్పారు. సామాన్యుడే మాకు వీఐపీ అని పదే, పదే మాట్లాడే టిటిడి సామాన్యుల పట్ల అనుసరిస్తున్న ధోరణి తీవ్రమైన విమర్శలకు గురవుతున్న విషయాన్ని పరిగణలో ఉంచుకోవాలని సూచించారు. ఇటీవల కాలంలో టిటిడి పై వస్తున్న విమర్శలను టిటిడి బోర్డు, యాజమాన్యం పరిగణనలో లేకుండా వ్యవహరిస్తున్న తీరును ఆయన తప్పు పట్టారు. ఈ ధోరణి మార్చుకోకపోతే భక్తుల ఆగ్రహానికి టీటీడీ యాజమాన్యం గురవుతుందని అన్నారు. పెంచిన ధరలను తక్షణం తగ్గించాలని సామాన్యుడు కేంద్రంగా నిర్ణయాలు జరగాలని సూచించారు.

సామాన్య భక్తులపై భారం మోపలేదు

మీడియాతో టిటిడి ఈవో ఎవి ధర్మారెడ్డి



ప్రజాశక్తి - తిరుమల

తిరుమల శ్రీవారి దర్శనార్థం విచ్చేసే సామాన్య భక్తులు బస చేసే 50, 100 రూపాయల అద్దె గదులను రూ.120 కోట్లతో ఆధునీకరించామని, వీటి అద్దె ఏమాత్రం పెంచలేదని టిటిడి ఈవో ఎవి ధర్మారెడ్డి స్పష్టం చేశారు. విఐపిల కోసం కేటాయించే గదుల్లో అద్దె వ్యత్యాసం లేకుండా చేసేందుకే నారాయణగిరి, ఎస్వీఆర్‌హెచ్, స్పెషల్‌టైప్ విశ్రాంతి గృహాలను ఆధునీకరించి తగిన అద్దె నిర్ణయించామని తెలిపారు. సామాన్య భక్తులపై అధిక భారం మోపారని కొన్ని ప్రసార మాధ్యమాల్లో జరుగుతున్న దుష్ప్రచారాన్ని భక్తులు నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. తిరుమల అన్నమయ్య భవనంలో గురువారం మీడియాతో ఎవి ధర్మారెడ్డి మాట్లాడుతూ తిరుమలలో మొత్తం 7,500 గదులు ఉన్నాయని, వీటిలో సామాన్య భక్తులకు సంబంధించి ఐదువేల గదులు ఉన్నాయని తెలిపారు. ఇటీవల ఈ గదుల్లో గీజర్, ఫర్నిచర్, ఫ్లోరింగ్ తదితర ఆధునీకరణ పనులు చేపట్టి భక్తులకు సౌకర్యవంతంగా తీర్చిదిద్దామన్నారు. విద్యుత్, ఇతర నిర్వహణ ఖర్చుకు రోజుకు రూ.250 వ్యయం అవుతుందని చెప్పారు. సామాన్య భక్తుల కోసం రూ.100 కోట్లతో పిఎసి -5 నిర్మిస్తున్నట్లు తెలిపారు. విఐపిలకు కేటాయించే నారాయణగిరి -1, 2, 3, 4 విశ్రాంతి గృహాలు, ఎస్వీఆర్‌హెచ్, స్పెషల్ టైప్, వివిఆర్‌హెచ్ విశ్రాంతి గృహాల్లోని మొత్తం 170 గదులను గీజర్, ఎసి, ఉడెన్‌కాట్, దివాన్ తదితర వసతులతో 8 కోట్లతో ఆధునీకరించినట్లు తెలిపారు.

ఆగమశాస్త్రం ప్రకారమే వైకుంఠ ద్వార దర్శనం

విలేకరులు అడిగిన ప్రశ్నకు ఈవో సమాధానమిస్తూ వైష్ణవాలయాల్లో పది రోజుల పాటు వైకుంఠ ద్వార దర్శనం కల్పించవచ్చని దేశవ్యాప్తంగా ఉన్న 32 మంది మఠాధిపతులు, పీఠాధిపతులు తెలియజేశారన్నారు. తద్వారా ఎక్కువమంది భక్తులు వైకుంఠ ద్వార దర్శనం చేసుకున్నారని తెలిపారు. పది రోజుల పాటు వైకుంఠ ద్వారం తెరచి కమర్షియల్ చేశారని టిటిడి మాజీ ఛైర్మన్ ఆరోపించడం భావ్యం కాదన్నారు. అవసరమైతే మఠాధిపతులతో పాటు పండితుల కమిటీ సమర్పించిన నివేదికను వారికి పంపుతామన్నారు. మీడియా సమావేశంలో జెఇఒలు సదా భార్గవి, వీరబ్రహ్మం, సివిఎస్‌ఒ నరసింహ కిషోర్, ఎస్వీబీసీ సిఇఒ షణ్ముఖ్ కుమార్, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, ఎస్ఇ 2 జగదీశ్వర్‌రెడ్డి, రిసెప్షన్ డెప్యూటీ ఈవోలు హరీంద్రనాథ్, భాస్కర్ పాల్గొన్నారు.



ఎముకకు అమర్చే 'ప్లేట్' లేదని...

సగంలోనే ఆపరేషన్ నిలిపివేత

ప్రైవేట్ ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలింపు

చిత్తూరు ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యం

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్

నిర్లక్ష్యానికి చిరునామా... చిత్తూరు ప్రభుత్వ వైద్యశాల... ఎక్స్‌రేలు, స్కానింగ్‌లు అన్నీ రోగిబంధువులను ముప్పతిప్పలు పెట్టి ప్రైవేట్‌గా చేయించారు.. టెస్టులు అన్నీ చేశాక ఆపరేషన్ థియేటర్‌లోకి రోగిని తీసుకెళ్లారు.. విరిగిన ఎముకకు ఆపరేషన్ మొదలు పెట్టారు.. తీరా ఎముక వద్ద అమర్చే 'ప్లేట్' లేదని అప్పుడు గుర్తించారు.. ఇంకేం చేస్తారు.. ఆపరేషన్ సగంలోనే నిలిపేసి ప్రైవేట్ ఆస్పత్రికి రిఫర్ చేసి అంబులెన్స్‌లో పంపించి చేతులు కడుక్కున్నారు.. ఇదీ చిత్తూరు ప్రభుత్వ వైద్యులు వృద్ధురాలైన రోగిపట్ల వ్యవహరించిన తీరు.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన వివరాలిలా ఉన్నాయి.

ఐదు రోజుల క్రితం యాదమరి మండలం దళవాయిపల్లికి చెందిన పుష్పమ్మ (62) తన నివాసంలో తలుపు తగిలి కాలుజారి కిందపడింది. కాలికి గాయం కావడంతో చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాలి ఎముక విరిగిందని సర్జరీ చేయాలని అనేక టెస్ట్‌లు రాశారు. తీరా ఆ టెస్టులేవీ ప్రభుత్వ ఆస్పత్రిలో లేకపోవడంతో ప్రైవేట్‌గా చేయించుకు రమ్మన్నారు. బుధవారం ఆపరేషన్ చేస్తామని చెప్పి ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్లారు. సగం సర్జరీ పూర్తి చేసిన తరువాత సదుపాయాలు లేవంటూ (ప్లేట్ లేదని) సగంలోనే ఆపరేషన్ ఆపేసి తిరుపతికి రిఫర్ చేయడంతో బాధితురాలి తరపు బంధువులు వైద్యుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేయడంతో హుటాహుటిన ప్రైవేట్ అంబులెన్స్‌లో తిరుపతికి తరలించారు. తరచూ ప్రభుత్వాసుపత్రిలో ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటూనే ఉన్నాయని, వైద్యుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు ప్రతి ఘటనలోనూ కనిపిస్తోందని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, జిల్లాలో 10 నుండి 19 సంవత్సరాల బాలికలు, గర్భిణీలు అనీమియా బారిన పడకుండా, పాఠశాలలో విద్యార్థుల నమోదు నిష్పత్తి మెరుగుపడేలా, బడి బయటి పిల్లలు బడిలో చేరేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి ఆదేశించారు. అమరావతి నుంచి రాష్ట్ర ముఖ్య కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి విద్య, వైద్యం, పంచాయతీరాజ్, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు వంటి పలు అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్షించగా తిరుపతి జిల్లా కలెక్టరేట్ నుంచి గురువారం జాయింట్ కలెక్టర్ డికె బాలాజీ, సంబంధిత అధికారులతో కలిసి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ విలేజి హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలను వెంటనే ప్రారంభించాలని, పునాది స్థాయి నుంచి స్టేజీ వారీగా పురోగతి ఉండాలని సూచించారు. ముఖ ఆధారిత హాజరు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ శ్రీనివాసరావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి శంకరనారాయణ, జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి విజయకుమార్, డి ఎల్ డి ఓ సుశీల దేవి, డిఎంహెచ్వో శ్రీహరి, సిపిఓ అశోక్ కుమార్, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికార అధికారి చెన్నయ్య పాల్గొన్నారు.

ఘనంగా త్యాగరాజస్వామి 176వ ఆరాధనోత్సవాలు

ప్రజాశక్తి - క్యాంపస్

వాగ్గేయకార చక్రవర్తి సద్గురు శ్రీ త్యాగరాజస్వామివారికి తిరుమల తిరుపతి దేవస్థానం సంకీర్తనల స్వరమాల వేసి నివాళులు అర్పించింది. ఆయన 176వ ఆరాధనోత్సవాన్ని గురువారం శ్రీవేంకటేశ్వర సంగీత నత్య కళాశాలలో అంగరంగ వైభవంగా నిర్వహించింది. శ్రీవేంకటేశ్వర సంగీత నత్య కళాశాల, శ్రీవేంకటేశ్వర నాదస్వర పాఠశాల ఆధ్వర్యంలో ఈ ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సివిఎస్వో నరసింహ కిషోర్ మాట్లాడుతూ శ్రీ త్యాగరాజస్వామి పంచరత్న కతులను ప్రతి ఒక్కరూ నేర్చుకుని, రాబోవు తరాలకు అందించాలన్నారు. ప్రతి కుటుంబంలో ఒక్కరైనా సంగీతం, సాహిత్యం, నత్యం నేర్చుకోవడం వల్ల ఆ కుటుంబాలు సుఖ సంతోషాలు, సౌభాగ్యాలతో ఉంటాయన్నారు. రాబోవు రోజుల్లో వేలాదిమందితో నగర సంకీర్తనగా పంచరత్న కతులను ఆలపించాలన్నారు. తమిళనాడులోని తిరువయ్యారు తరహాలో నిర్వహించిన శ్రీత్యాగరాజస్వామివారి ఘనరాగ పంచరత్న కతుల బందగానం సంగీతప్రియులను అలరించింది. ఈ కార్యక్రమంలో టీటీడీ డీఈవో భాస్కర్ రెడ్డి, డెప్యూటీ ఈవో గోవిందరాజన్, అన్నమాచార్య ప్రాజె క్టు సంచాలకులు డాక్టర్ విభీషణ శర్మ, ఎస్వీ సంగీత కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ పాల్గొన్నారు.

ఉద్యోగులు ముఖ ఆధారిత హాజరు తప్పనిసరి:కలెక్టర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ప్రభుత్వ ఉత్తర్వులు 159 తేది: 26.12.2022 మేరకు జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు ముఖ ఆధారిత హాజరు నమోదు చేయాలని కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం స్థానిక కలెక్టరేట్ లోని సమావేశమందిరంలో జిల్లా కలెక్టర్ ముఖ ఆధారిత హాజరు నిర్వహణపై ఎన్.ఐ.సి., జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు జనవరి 01 నుండి సిబ్బంది ఈ నెల 16 నుండి ప్రారంభించాలని ఉత్తర్వులలో పేర్కొన్నవిధంగా ముఖ ఆధారిత హాజరు నమోదు చేయాల్సి ఉంటుందని అన్నారు. ఎ.పి.ఎఫ్.ఆర్.ఎస్. యాప్ డౌన్ లోడ్ విధానంలో ఇబ్బందులు తలెత్తితే ఎన్.ఐ.సి. అధికారులను (7013364471) సంప్రదించాలని సూచించారు. డి.డి.ఓ. గా ఉన్న అధికారులు తమ సిబ్బంది పనిచేసే ప్రదేశాల జియోగ్రాఫికల్ (అక్షాంస, రేఖాంశాల) లొకేషన్ అసైన్ చేయాల్సి ఉంటుందని, పూర్తి స్థాయిలో ఈ నెల 16 నుండి హాజరు నమోదు జరిగేలా చూడాలని సూచించారు. హాజరు నిర్వహణలో ఇబ్బందులను గుర్తించి త్వరగా నివేదిక తయారుచేసి ప్రభుత్వానికి నివేదించాలని డి.ఆర్.ఓ.కు సూచించారు. ఈ సమీక్షలో జిల్లా రెవిన్యూ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

16న ఎస్వీ గోశాలలో 'గోపూజ మహోత్సవం'

తిరుమల : తిరుపతి శ్రీ వెంకటేశ్వర గోసంరక్షణశాలలో 16న కనుమ పండుగ సందర్భంగా గోపూజ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. గోపూజ మహోత్సవం రోజున గోవులకు బెల్లం, బియ్యం, గ్రాసం భక్తులు స్వయంగా తినిపించే అవకాశాన్ని టీటీడీ కల్పిస్తోంది. ఈ సదవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకుని పేర్కొంది.

అత్యాచార దోషులను కఠినంగా శిక్షించాలి : ఐద్వా



ప్రజాశక్తి - తిరుపతి టౌన్

అత్యాచార దోషులను కఠినంగా శిక్షించాలని, మహిళలకు, ఆడపిల్లలకు రక్షణ కల్పించాలని ఐద్వా జిల్లా అధ్యక్షులు మాసుపల్లి జయంతి, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి నదియా ఆధ్వర్యంలో ఎస్‌పి కార్యాలయంలో ఎఎస్‌పిని కలిసి వినతిపత్రం అందజేశారు. నేడు తిరుపతిలో పారిశుధ్య కార్మికురాలిపై అతి కిరాతకంగా అత్యాచారం జరిగిందని, నిన్న వెంకటగిరి నియోజకవర్గం ఓజిలిలో 15 సంవత్సరాల గిరిజన బాలికపై అత్యాచారం చేశారన్నారు. ఇటీవల సత్యవేడు మండలం వెంకటరాజుల కండ్రిగ అరుంధతివాడకు చెందిన బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారన్నారు. వెలుగులోకి రాని ఘటనలు ఎన్నో ఉన్నాయన్నారు. ఫోక్సో, దిశ, నిర్భయ లాంటి చట్టాలు ఉన్నా మహిళలకు రక్షణ కరువవుతుందన్నారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంజుల, అమ్ములమ్మ, అమ్మాజీ పాల్గొన్నారు.

సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయండి



తిరుపతి టౌన్ : సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సిఐటియు) 17వ అఖిలభారత మహాసభలు బెంగళూరు నగరంలో ఐదు రోజులు పాటు పెద్ద ఎత్తున జరగనున్నాయని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి వెల్లడించారు. తిరుపతి యశోదా నగర్ లోని సిఐటియు జిల్లా కార్యాలయం వద్ద అఖిలభారత మహాసభల పోస్టర్లను సిఐటియు నేతలు ఆవిష్కరించారు. జనవరి 18 - 22 తేదీలలో జరిగే సిఐటియు అఖిలభారత మహాసభలకు దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి వందలాది మంది ప్రతినిధులు పాల్గొంటారని వివరించారు. 22వ తేదీన జరిగే భారీ బహిరంగ సభలో సిఐటియు చేపట్టబోయే భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు పరుగులు తీస్తోందని, కార్మిక వర్గం దివాళా తీసిందని ప్రభుత్వ రంగం బలహీన పడిందని ఆరోపించారు. రైల్వే లాంటి బలమైన ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ, అంబానీలకు తాకట్టు పెట్టేందుకు మోడీ ప్రభుత్వం ఉవ్విళ్లూరుతోందని విమర్శించారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నేతలు అంగేరి పుల్లయ్య, టి. సుబ్రమణ్యం, వేణుగోపాల్, ఆర్. వెంకటేష్, మునిరాజా, తంజావూరు మురళి, దేవ తదితరులు పాల్గొన్నారు

నేచురల్ గ్యాస్ స్టేషన్ ప్రారంభం



తిరుపతి సిటీ : భారతీయ సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ (సిజిడి) పరిశ్రమలో అగ్రగామి సంస్థల్లో ఒకటైన ఎజి అండ్ బి ప్రథమ్ ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటి లిక్విఫైడ్ కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (ఎల్‌సిఎన్‌జి) స్టేషన్‌ను కడప జిల్లాలోని ఎపిఐఐసి పారిశ్రామిక పార్కు వద్ద ప్రారంభించింది. ఈ స్టేషన్‌ను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా షేక్ బెపారీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎజీ అండ్ పీ ప్రథమ్ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ అభిలేష్ గుప్తా, ఎజి అండ్ పి ప్రథమ్ సీనియర్ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అంజాద్‌బాష మాట్లాడుతూ సంప్రదాయ ఇంధన వనరుల్లాంటి పెట్రోల్ డీజిల్‌తో పోలిస్తే సిఎన్‌జీలో ప్రయోజనాలు అధికంగా ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు.

హెచ్‌ఎఫ్‌సీ లిమిటెడ్ నూతన కార్యాలయం ప్రారంభం



ప్రజాశక్తి -తిరుపతి టౌన్

దేశంలోని ప్రధాన గృహరుణ సంస్థల్లో ఒకటైన హెచ్‌ఎఫ్సీ లిమిటెడ్ మదనపల్లెలో కొత్త కార్యాలయాన్ని ప్రారంభించింది. ఈ కార్యాలయాన్ని రాజన్ టాండన్ (రీజినల్ బిజినెస్ హెడ్ - తెలంగాణ ,ఆంధ్రప్రదేశ్) హెచ్డీఎఫ్సీ లిమిటెడ్ ఇతర సీనియర్ అధికారుల సమక్షంలో మదనపల్లెలో కొత్త కార్యాలయాన్ని ప్రారంభించారు. సందర్భంగా హెచ్‌ఐఎఫిసి లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ రేణు సుద్ కర్నాడ్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్లో మదనపల్లె ఒక ముఖ్యమైన నగరమని, ఈ నగరం గణనీయమైన ఆర్థిక కార్యకలాపాలను చూస్తోందని అన్నారు. తద్వారా ఈ నగరం, చుట్టుపక్కల గృహాలకు చాలా డిమాండ్ ఉంటుంది కాబట్టి ఇది వద్ధికి అద్భుతమైన అవకాశాన్ని అందిస్తుందన్నారు. ఈ కరోనా గడ్డుకాలం ప్రతివారికి స్వంత ఇంటి అవశ్యకతను తెలియచేసింది. గృహరుణాలు అనేవి మొదటిసారి కొనుగోలు చేసేవారికి తమ స్థాయిని పెంచే విలాసవంతమైన గృహాలు కొనుగోలు చేసేవారికి వర్తిస్తుందని అన్నారు.

'7స్టార్' ర్యాంకింగ్ సాధిస్తాం : కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్



తిరుపతి నగర ప్రజల సహకారంతో నగరపాలక సంస్థ సిబ్బంది కషితో స్వచ్ఛ సర్వేక్షన్ విషయంలో 7 స్టార్ ర్యాంకింగ్ సాధిస్తామని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి అన్నారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం కమిషనర్ అనుపమ మీడియా సమావేశంలో మాట్లాడుతూ మరో నెల రోజుల పాటు జరిగే స్వచ్ఛ సర్వేక్షన్లో భాగంగా తిరుపతి నగర పాలక సంస్థ ప్రజలను చైతన్యం చేయడంతో బాటు సిబ్బంది కషితో క్లీన్ సిటీగా సిద్ధం చేయడం ద్వారా ఈ సంవత్సరం నుండి 7 స్టార్ ర్యాంకింగును ప్రవేశపెట్టిన కేంద్రం నిబంధనలు చేరుకొని ర్యాంకింగును సాధించడం జరుగుతుందన్నారు. తిరుపతిని క్లీన్ సిటీగా ఉంచేలా సహకరించాలని, ఇళ్ల వద్దకే వస్తున్న శానిటరీ సిబ్బందికి తడి పొడి చెత్తలను విడి విడిగా అందించాలని, కాలువల్లో వ్యర్థ పదార్థాలను, ప్లాస్టిక్ బాటిల్స్ ను వేయకుండా మునిసిపల్ సిబ్బందికి సహకరించాలని కోరారు. సిబ్బంది సంక్షేమం గురించి వివరిస్తూ సంక్రాంతి సందర్భంగా ప్రతి ఒక్క శానిటేషన్ సిబ్బంది, డ్రైవర్లకు 3 వేలు విలువ చేసే కిట్లు కల్గిన యూనిఫాం, చీరలు, కొబ్బరినూనె, సోపులు, చెప్పులు అందించడం జరిగిందన్నారు. ఈ నెల 18వ తేది మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివద్దిలో భాగంగ అంకురా హాస్పిటల్ రోడ్డును అదేవిధంగా 5 ఎం.ఎల్ మురికినీటి శుద్ది కేంద్రాన్ని ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, కార్పొరేటర్ల చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు. అదేరోజు మేయర్ అధ్యక్షతన జరిగే కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్ల సమక్షంలో తిరుపతి అభివద్దికి చేయాల్సిన పనులను ఆమోదించడం జరుగుతుందని తెలిపారు

విశ్వం స్కూల్లో టూరిజం క్లబ్ ఏర్పాటుకు శ్రీకారం

క్యాంపస్ : విశ్వం విద్యా సంస్థల అధినేత డా. ఎన్.విశ్వ నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా టూరిజం క్లబ్ ఏర్పాటు చేశారు.యువ టూరిజం క్లబ్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలోని పిల్లలను క్లబ్ లాగా ఏర్పాటుచేసి పిల్లలకు టూరిజం యొక్క ఆసక్తితో పాటు ప్రాముఖ్యతను తెలియజేయనుంది. జాతీయ సమైక్యతను పెంపొందించడానికి భారత ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జీవకోన లోని విశ్వం హై స్కూల్ లో ఘనంగా "టూరిజం క్లబ్ "ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా టూరిజం హబ్ తిరుపతి రీజనల్ డైరెక్టర్ డా. రమణ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు టూరిజం లో సరైన అవగాహన కోసమే యువ టూరిజం క్లబ్ ను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వం విద్యా సంస్థల అధినేత డా.ఎన్.విశ్వ నాథ్ రెడ్డి, , తిరుపతి టూరిజం శాఖ డిప్యూటీ మేనేజర్ పుష్ప రాజేష్, విశ్వం స్కూల్ ప్రధానోపాధ్యాయులు పిసి.సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సమస్యలపై సీఐకి వినతి



ప్రజాశక్తి-గూడూరు: గూడూరు పట్టణంలోని ఆటో కార్మికులు గురువారం సీఐని కలిసి పలు సమస్యలను విన్నవించారు. ఆటోలకు పోలీసులు అందించిన నంబర్లు, గుర్తింపు కార్డులు తప్పనిసరిగా ఉంచుకోవాలని.. ఇందుకు రూ.200 చెల్లించాలని చెబుతున్నారని.. పూట గడవక.. వచ్చే బాడుగులతో ఆటోలకు ఫైనాన్స్‌లు కట్టుకోలేక ఇబ్బందులకు గురవుతున్నామని వాపోయారు. తిరుపతిలో పోలీసులు ఆటో కార్మికులకు ఉచితంగా చేయించారని.. అలాగే గూడూరులోనూ ఉచితంగా ఐ.డి. కార్డులు, పోలీస్ నంబర్లు ఇప్పించాలని కోరారు. తిరుపతి జిల్లా ఆటో కార్మిక సంఘం సి.ఐ.టి.యు. నాయకులు బి.వి.రమణయ్య, గూడూరు పట్టణ సి.పి.ఎం నాయకులు జోగి శివకుమార్, బి.గోపీనాథ్, ఎస్కే. మున్నా, బాల గురవయ్య, వి.రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్లకు పెండింగ్ జీతాలివ్వాలి



ప్రజాశక్తి- పిచ్చాటూరు: గ్రీన్ అంబాసిడర్లకు పెండింగ్ జీతాలు వెంటనే ఇవ్వాలని పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు సత్యవేడు నియోజకవర్గ ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి ఆంబాకం చిన్నిరాజు మాట్లాడుతూ కార్మికులకు నెలల తరబడి జీతాలు ఇవ్వకుండా ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని..సంక్రాంతి పండగకు జీతాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొందని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో నంబరు 680 వెంటనే అమలు చేయాలని.. స్వచ్ఛభారత్ కార్మికులకు పని భద్రత కల్పించి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి సుభాష్, అన్నాదొరై, మునిచంద్ర, నాయకులు విజయ, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు



ప్రజాశక్తి-బాలాయపల్లి : పంచాయతీ నిధుల దుర్వినియోగంపై ఎంపీడీవో వినిల్ కుమార్‌కు మండలంలోని మన్నారు గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ ఏర్పడినప్పటి నుంచి పంచాయతీకి వచ్చిన నిధులు ఖర్చుపై ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే వచ్చిన నిధులు దుర్వినియోగం చేశారన్నారు. పంచాయతీ కార్యదర్శి హేమంత్ కుమార్, గ్రామ సర్పంచి కుమ్మక్కు అయ్యారని తెలిపారు. గ్రామ సమస్యలను ప్రశ్నిస్తే సర్పంచ్ భర్త ఎంపీటీసీ కావడంతో వద్ధులకు ఇస్తున్న పింఛన్లు ఇవ్వకుండా బెదిరిస్తున్నారన్నారు. సచివాలయ సిబ్బందిని సైతం బెదిరింపులకు గురిచేస్తున్నట్లు వాపోయారు. మున్నూరు కొత్తఊర్లో తాగునీటికి గిరిజన కాలనీ, దళితులు తాగునీటి కోసం అలమటిస్తున్నామని చెబితే మీరే మరమ్మతులు చేయించుకోవాలంటున్నారని ఎంపీడీవోతో వాపోయారు. స్పందించిన ఎంపీడీవో సమస్యలపై గూడూరు డివిజన్ పంచాయతీ అధికారి దష్టికి తీసుకెళ్లి వెంటనే గ్రామ సభ ఏర్పాటు చేస్తామన్నారు. తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని ఈవోపీఆర్డీ మోహన్‌రాజును ఆదేశించారు.

క్రికెట్ పోటీల టీషర్టుల ఆవిష్కరణ



ప్రజాశక్తి -గూడూరు : గూడూరు పట్టణంలోని ఆల్లూరు ఆదిశేషారెడ్డి స్టేడియంలో కనుమూరి హరిచంద్ర రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మాస్టర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఈనెల 13, 14, 15వ తేదీలలో నిర్వహించనున్నారు. ఈ పోటీలకు సంబంధించిన టీ షర్టులను గురువారం నిర్వాహకులు కనుమూరి హరిచంద్రారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు మనపాటి రవీంద్రబాబు, ఆర్గనైజేషన్ సెక్రటరీ నూర్ అహ్మద్, సెక్రటరీ నాగేశ్వరరావు, క్రీడా అభిమానులు పాల్గొన్నారు.

అధిక ఛార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు

ప్రైవేట్ ట్రావెల్స్‌పై ప్రత్యేక నిఘా



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: సంక్రాంతి పండుగ సందర్భంగా జిల్లాలో తిరుపతి నుంచి హైదరాబాద్, చెన్నయ్, బెంగుళూరు వెళ్లు, అక్కడనుంచి వచ్చే ప్రయాణికుల నుంచి అధిక ఛార్జీలు వసూలు చేయరాదని, వాటి నియంత్రణకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని జిల్లా రవాణ శాఖ అధికారి సీతారామిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఎవరైనా అధిక ఛార్జీలు ప్రయాణికుల నుంచి వసూలు చేసినట్లు ఫిర్యాదులు అందితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ప్రైవేట్ బస్సు ఆపరేటర్ల బస్సులను తనిఖీ చేస్తామని హెచ్చరించారు. అసాధారణ ఛార్జీలతో ప్రయాణికులను దోచుకున్నా, అవకతవకలకు పాల్పడినా కేసులు నమోదు చేసి, బస్సులను సీజ్ చేస్తామన్తామన్నారు. బుధవారం నుంచి అధిక బస్సు ఛార్జీలను వసూలు చేసినందుకు మూడు, ఇతర నిబంధనల అతిక్రమణ కేసులు 20 నమోదు చేశామన్నారు. పై అంశాలపై ఫిర్యాదు చేయదలచిన వారు 9966331142 వాట్స్ అప్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.

ఘనంగా జాతీయ యువజన దినోత్సవం



తిరుపతి మంగళం: శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో...



పుత్తూరు డిగ్రీ కళాశాలలో...



కోట : ఎన్‌బీకే ఇంజినీరింగ్ కళాశాలలో...



వరదయ్యపాళెంలో పేదలకు దుప్పట్ల పంపిణీ



శ్రీకాళహస్తిలో ...



బుచ్చినాయుడుకండ్రిగ పాఠశాలలో...



రేణిగుంటలో...



గూడూరులో యువత ఆధ్వర్యంలో...

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ సేవ విభాగం, ఇనిస్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య వ్యాఖ్యాతగా తిరుపతి రామకష్ణ మిషన్ సెక్రటరీ స్వామి సుకతనంద హాజరై భారతీయ భవిషత్తు యువత చేతుల్లోనే ఉందని, వివేకానంద చూపిన మార్గంలో నడవాలని, వివేకానందుని రచనలను చదివితే అసలు యువత ఈ దేశ భవిష్యత్తుపై వారి బాధ్యత అర్థమౌతుందన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎన్.వాసు, కళాశాల ఛైర్మన్ మన్నెం రామిరెడ్డి, డైరెక్టర్లు మన్నెం రామసుబ్బారెడ్డి, మన్నెం అరవింద్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ కె.జయచంద్ర, జాతీయ సేవా విభాగం కన్వీనర్ ఎస్.చక్రి శ్రీధర్, ప్రోగ్రాం కన్వీనర్ కుమారి, జమీల విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి రూరల్: స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సామాజిక సామరస్యత వేదిక ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 161వ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వర పాలకమండలి ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ స్వామి వివేకానందను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ఆయన మార్గంలో నడవాలని తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి డీఎస్పీ విశ్వనాథ్, సీఐ అజయ్, బీజేపీ నాయకులు చంద్రప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్: స్థానిక వివేకానంద ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, స్వామి వివేకానంద పాఠశాలలో, స్వామి వివేకానంద 161 వ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ డి. సదాశివం వివేకానంద చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆధ్యాత్మిక గురువు పేట బాలకష్ణారెడ్డి, వివిధ విద్యా సంస్థల ప్రిన్సిపాళ్లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఘనంగా యువజన దినోత్సవ వేడుకలు యోగా గురువు సురేష్ నాయుడు, తెలుగు ఉపాధ్యాయులు యువశ్రీ మురళీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అలాగే వివేకానంద విగ్రహానికి పాఠశాల పూర్వ విద్యార్థులు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు షణ్ముగం, శ్రీనివాసులు, సురేంద్ర, ఉషారాణి, సుబ్రమణ్యం, మునికుమార్, నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోట : కోట మండలం విద్యానగర్ ఎన్‌బీకే ఇంజినీరింగ్ కళాశాలలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ్ కుమార్‌రెడ్డి, సైన్స్ అండ్ హ్యుమానిటీస్ విభాగాధిపతి డాక్టర్ రవీంద్రారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రిటైర్డ్ రిజర్వ్ బ్యాంక్ ఉద్యోగి ధర్మిగారి జయచంద్రబాబు, ధర్మిగారి జయప్రకాష్ ఏర్పాటు చేసిన వివేకానంద స్వామి విగ్రహానికి ఆయన జయంతి సందర్భంగా నివాళులు అర్పించారు. ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, అధ్యాపకులు నరసింహులు, మున్సిపల్ ఎస్.అపరంజి, ఆర్ఎస్ఎస్ సభ్యులు లోకేష్, శేఖర్ఆచారి, తేజోవర్మ, చక్రపాణి, సేతు, శ్రీకాంత్, ధనంజయులు, కేశవ, రమేష్ పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: స్వామి వివేకానంద 161వ జయంతి సందర్భంగా స్థానిక బీఈపీసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం గోపాల్‌రావు కాలనీలోని వద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. తహశీల్దారు గౌరీశంకర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలని కోరారు. సంస్థ నిర్వాహకులు రియాజ్, సర్పంచ్ జ్యోతి, సర్వేయర్ మునస్వామి, సభ్యులు అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు

గూడూరు రూరల్: స్వామి వివేకానంద జయంతి సందర్భంగా గూడూరు జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన విద్యార్థి విభాగం భగత్ సింగ్ స్టూడెంట్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం వివేకానంద చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సభ్యులు విశ్వశివ ప్రసాద్, పెంచలయ్య, హేమంత్, మణి, పూర్ణ పాల్గొన్నారు.

రేణిగుంట: నేటి యువత స్వామి వివేకానంద జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు తెలిపారు. గురువారం రేణిగుంటలోని ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో సంస్థ అధ్యక్షుడు ఆధ్వర్యంలో స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాట్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ ఐజయ్య, ఆషా సంస్థ ముఖ్య సలహాదారులు అమ్ములురాజు పాల్గొన్నారు.

విద్యాలయాల్లో సంక్రాంతి సంబరాలు



తిరుపతి బైరాగిపట్టెడలో...

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): బైరాగిపట్టెడలోని శ్రీ బాబా విద్యానికేతన్ లో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గురువారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎల్.రమేష్ బాబు, హెడ్ మాస్టర్ బాలాజీ, సాయినగర్ సర్పంచ్ డీవీ రమణ పోటీల్లో గెలుపొందిన విజేతలకు భాగవతం, రామాయణం, మహాభారతం పుస్తకాలను అందించారు.

పిచ్చాటూరు: వేలూరు అంగన్‌వాడీ కేంద్రంలో ముందస్తు సంక్రాంతి సంబరాలను సీడీపీవో శోభారాణి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మారియమ్మ, కార్యకర్తలు లత, బేబీ, శ్రీదేవి, సుమతి, ప్రమీల, భారతి తదితరులు పాల్గొన్నారు.

కోట: కోటలోని శ్రీచైతన్య స్కూల్‌లో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. పాఠశాల ప్రిన్సిపల్ వెంకట సుధీర్, డీన్ శివయ్య, జోనల్ కో ఆర్డినేటర్ హిమబిందు, ప్రైమరీ, ప్రీ ప్రైమరీ ఇన్‌ఛార్జిలు హరిత, వినీల తదితర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు అండగా వైఎస్‌ఆర్ కుటుంబం



ప్రజాశక్తి-నాయుడుపేట: వైఎస్ఆర్ కుటుంబం రైతులకు అండగా ఉంటోందని.. సూళ్లూరుపేట ఎమ్మెల్యే సంజీవయ్య, ఎంపీ మద్దెల గురుమూర్తి అన్నారు. నాయుడుపేట వ్యవసాయ మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన ఏఎంసీ ఛైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఎంతో కాలంగా వైసీపీలో ఉంటూ నాయుడుపేటలో పార్టీ బలోపేతానికి కషి చేసిన సీనియర్ నాయకులు జనార్దన్‌రెడ్డి ఏఎంసీ ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయడం సంతోషకరమన్నారు. సీడీసీ ఛైర్మన్ కె.సత్యనారాయణరెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి, కిలివేటి సంజీవయ్య యువసేన అధ్యక్షుడు పొట్లపూడి రాజేష్, కౌన్సిలర్లు దారా రవి, కొండూరు రామకష్ణంరాజు, మాజీ ఏఎంసీ ఛైర్మన్ రాధాకిషోర్ యాదవ్, ఎంపీపీ ధనలక్ష్మి, నాయుడుపేట మునిసిపల్ ఛైర్మన్ దీపికా, నాయుడుపేట సీఐ ప్రభాకర్‌రావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిటిడి వినాయక నగర్‌లో సంక్రాంతి సందడి



ప్రజాశక్తి -తిరుపతి టౌన్: సంక్రాతి అంటేనే పాడి పంటలు, భోగి మంటలు, ఆట పాటలతో ఆనందం గా గడుపుకొనేవి. నిత్యం చదువులతో పిల్లలు, వంటింటికి పరిమితమవుతున్న మహిళలు, నిరంతరం భక్తుల సేవలో తరించే ఉద్యోగులకు కొంత ఆటవిడుపుగా ఉండటానికి ఈ ఆటలు పోటీలను టిటిడి వినాయకనగర్‌లో ఆనవాయితీగా నిర్వహిస్తున్నారు. 10 తేదీ నుండి 14 తేదీ వరకు నాలుగు రోజుల పాటు టి టి డి వినాయక నగర్ గ్రౌండ్ లో మహిళలకు ముగ్గులపోటీలు, టాగ్గాపర్, మ్యూజికల్ చైర్స్, బకిట్‌ఇన్ ద బాల్, హిట్ ఇన్ ద ఇండియన్ క్లబ్, త్రోబాల్ మొదలైనవి నిర్వహించనున్నారు. పిల్లల కు రన్నింగ్ రేస్, మ్యూజికల్ చైర్స్, ఫ్రాగ్ జంప్, చెస్, క్యారమ్స్, షెటిల్, డ్రాయింగ్, క్విజ్ పోటీలు పెట్టారు. 14 తేదీ వినాయక నగర్ గ్రౌండ్ నందు పిల్లలు పెద్దలు అందరూ కలసి పండుగను వేడుకగా చేసుకోనున్నట్లు కమిటీ నిర్వహకులు, ప్రెసిడెంట్ జి.వెంకటేశం, సభ్యులు పి.దయాకర్, ఏ.మురళిమోహన్, ఎం.సురేష్ బాబు ,ఎన్ చొక్కాలింగం ఏం.ధనంజయ్, జి.మహేష్, కిరణ్, వై.సుబ్బారాయుడు, హేమంత్, నాగేంద్ర, రమేష్, కిట్టు, దాసు, భషీర్, మహిళలు శ్రీలక్ష్మి, అలేఖ్య, సునీత, మీనా, సోనియా, భావన, కోమల, రుక్మిణి పేర్కొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ క్యాలెండర్ విడుదల



ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టే రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి ప్రవేశ పరీక్ష రీసెట్ కన్వీనర్ గా నియమితులైన ఆచార్య దేవప్రసాద్ రాజు చేతుల మీదుగా ఎస్ఎఫ్ఐ తిరుపతి జిల్లా నూతన క్యాలెండర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఆచార్య బి. దేవా ప్రసాద్ మాట్లాడుతూ కష్టపడి బాగా చదువుకొని మంచి ప్రయోజకులుగా అవ్వాలని వారు అన్నారు. జిల్లా కార్యదర్శి మాధవ కష్ణ మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలో ప్రజాస్వామిక విలువలు కాపాడేటువంటి మేధావులు నేటి సమాజానికి అవసరమన్నారు. జిల్లా అధ్యక్షులు రవి, ఉపాధ్యక్షులు అక్బర్ జిల్లా నాయకులు పథ్వి, శివ నాయకులు సునీల్, వేమన, వెంకీ, రాము తదితరులు పాల్గొన్నారు.

బ్రోచర్ ఆవిష్కరణ

క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం బోటనీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే రెండువారాల పునశ్చరణ తరగతుల బ్రోచర్ ను ఎస్వీయూ ఉపకులపతి ఆచార్య కె. రాజారెడ్డి ,రిజిస్ట్రార్ ఆచార్య మహమ్మద్ హుస్సేన్ ఆవిష్కరించారు. "బయాలజీ ఇన్ 21 సెంచరీ ఆస్పెక్ట్స్ అండ్ ప్రాస్పెక్ట్స్" అనే అంశంపై జరిగే 15 రోజుల తరగతులను అధ్యాపకులు సద్వినియోగం చేసుకోవాలని విసి తెలిపారు. డైరెక్టర్‌గా ఆచార్య మోహనాచారి, కన్వీనర్‌గా డా. నాగలక్ష్మీదేవమ్మ వ్యవహరిస్తారు. ఆచార్య సావిత్రమ్మ, డీన్ ఆచార్య దామోదర రెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ



ప్రజాశక్తి-చిల్లకూరు: రాజునేని రామానాయుడు ట్రస్ట్ వ్యవస్థాపకులు రాజునేని శ్రీనివాసులునాయుడు ఆధ్వర్యంలో గురువారం దివ్యాంగులకు తొమ్మిది ట్రై సైకిళ్లు, వాకర్‌లను చేడుమాల గ్రామంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు సాయం చేయడం సంతోషకరంగా ఉందన్నారు. గూడూరు డివిజన్లోని నాలుగు మండలాల్లో దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా వారంరోజులపాటు సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం వికలాంగులు ఆయన్ను ఘనంగా సన్మానించారు.

రామకృష్ణాపురంలో ఎల్ఈడీ దీపాలు



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రామకృష్ణాపురంలో సర్పంచ్ విరిత దేవేంద్రరెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఎల్ఈడీ వీధి దీపాలు ఏర్పాటు చేశారు. సంక్రాంతి పండుగలకు గ్రామాల్లో విద్యుత్ దీపాల సమస్య లేకుండా ఉండేందుకు తగిన ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మునినరేష్‌కుమార్ పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని భాకరాపేట ఎస్సై ప్రకాష్ కుమార్ తెలిపారు. కోడిపందేలు, జల్లికట్టు, పేకాట, బెట్టింగ్, అక్రమ మద్యం, నాటుసారా, తాగి వాహనాలు నడపడం తదితర అంశాలపై నిషేదాలు ఉన్నాయన్నారు. అల్లర్లకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కబడ్డీ విజేతలకు ట్రోఫీల పంపిణీ



ప్రజాశక్తి-చిల్లకూరు: గుమ్మలదెబ్బ గ్రామంలో గురువారం కబడ్డీ విజేతలకు ట్రోఫీలు అందించారు. 15 రోజుల నుంచి గుమ్మలదెబ్బ గ్రామంలో పోటీలను కష్ణపట్నం పోర్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. సీఎస్ఆర్ యాక్టివిటీస్ కింద కష్ణపట్నం పోర్టు వారు సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ క్రీడలు నిర్వహించారు. పోర్టు డైరెక్టర్ ఆదాని చేతుల మీదుగా గురువారం విజేతలకు ట్రోఫీలు పంపిణీ చేశారు. వీఆర్వో వేణుగోపాల్, సీఎస్ఆర్ హెడ్ రాజేష్ , రంజిత్, ఇన్‌ఛార్జి శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేర వార్తలు

హత్య కేసులో 9 మందికి యావజ్జీవ శిక్ష

ప్రజాశక్తి-గూడూరు రూరల్: ఓ హత్య కేసులో గూడూరు పట్టణంలోని ఏడో అదనపు జిల్లా జడ్జి 9 మంది ముద్దాయిలకు యావజ్జీవ శిక్ష విధిస్తూ గురువారం సంచలనాత్మక తీర్పు ఇచ్చారు. 2013 సంవత్సరంలో ఉమ్మడి నెల్లూరు జిల్లా అల్లూరు మండలం వెలిచెర్ల గ్రామంలో కోవూరు రామయ్య హత్య కేసులో విచారణ పూర్తి అయిన అనంతరం హత్య కేసులో 9 మంది ముద్దాయిలకు శిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. కేసులో మొత్తం పదిమంది ముద్దాయిలు కాగా.. వారిలో మొదటి ముద్దాయి రమేష్ మరణించగా మిగిలిన 9 మందికి శిక్ష ఖరారు చేశారు. ఈ కేసును ఏపీపీ సుహాసిని వాదించారు.

16 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి సమీపంలోని పాపానాయుడు పేట వద్ద ఎర్రచందనం చెట్లను వేర్లతో సహా పెకిలించిన 16 దుంగలను అక్రమ రవాణా చేస్తుండగా టాస్క్‌ఫోర్సు పోలీసులు స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేశారు. టాస్క్ ఫోర్స్ ఎస్పీ కె.చక్రవర్తి సూచనలతో కడప ఆర్ఐ ఎం.చిరంజీవులు, ఆర్ఎస్ఐ నరేష్ బందం బుధవారం తిరుపతి జిల్లా ఏర్పేడు నుంచి కేవీబీపురం వైపుగా కూంబింగ్ చేపట్టారని, గురువారం ఉదయం తిరుపతి రేంజి పాపానాయుడు పేట బీట్ పరిధిలోని చెల్లూరు పరిధిలోని ఇరగలప్ప స్వామి ఆలయం వద్ద కొందరు వ్యక్తులు కనిపించారు. పారిపోయే ప్రయత్నం చేయగా వారిలో ఒకరు పట్టుబడ్డారన్నారు. పట్టుబడ్డ వ్యక్తి చెల్లూరు పోస్టు గుల్లకండ్రిగ గ్రామానికి చెందిన ఆవులూరి పద్మనాభం (41)గా గుర్తించామన్నారు. టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్లో కేసు నమోదు చేసి సీఐ చంద్రశేఖర్ దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

పారా లీగల్ వాలంటీర్ల నియామకానికి దరఖాస్తులు



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ : సేవాభావం కలిగిన వారు పారా లీగల్ వాలంటీర్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవా సంస్థ అధ్యక్షులు రాఘవేంద్ర తెలిపారు. గురువారం జడ్జి విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, విశ్రాంతి ఉద్యోగులు, స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు, న్యాయవాదులు, అంగన్‌వాడీ సహాయకులు, సామాజిక కార్యకర్తలు, కార్మిక సంఘాల సభ్యులు, కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు అర్హులని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా ఉండాలని, క్రిమినల్ కేసుల్లో ఉండరాదని తెలిపారు.

టీటీడీ అనాలోచిత నిర్ణయాలతో భక్తుల కష్టాలు



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలకు భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని సామాజికవేత్త మాంగాటి గోపాల్ రెడ్డి విమర్శించారు. వైకుంఠ ఏకాదశి పర్వదినం గడియలు ముగిసిన తర్వాత వైకుంఠ ద్వారాలు తెరిచి దర్శనాల కేటాయింపునకు టైం స్లాట్ టోకెన్లను జారీ చేసి గంటల కొద్దీ భక్తులను కాంప్లెక్స్ లో ఉంచడంతో భక్తులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని, శ్రీవారి దర్శనం కోసం తిరుమలకు వెళ్లిన ఆయన స్వీయ అనుభవాలను మీడియాకు వివరించారు. సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తున్నామని చెబుతూనే టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి వీఐపీలకు ప్రత్యేక దర్శనాలను కల్పిస్తూ క్యూ లైన్‌లలోనే సామాన్య భక్తులకు దేవుడ్ని చూపిస్తున్నారన్నారు. టైం స్లాట్ ప్రకారం నిర్దేశించిన సమయంలో స్వామివారి దర్శనం కల్పించలేని టీటీడీ ఎందుకు టైం స్లాట్ బుకింగ్ కేంద్రాలను నిర్వహిస్తూ లక్షల రూపాయల భక్తుల సొత్తును ఖర్చు చేస్తున్నారని ప్రశ్నించారు. తిరుమలకు భక్తులు రాకూడదని గదుల అద్దెలను ఇష్టానుసారం పెంచుతున్నారా? అని టీటీడీ యాజమాన్యం తీరును ప్రశ్నించారు. కన్నా రెడ్డి మాట్లాడుతూ తిరుచానూరులో బ్రాహ్మణులు యాచకులుగా వ్యవహరిస్తున్నారని, డబ్బులిస్తేనే సెటగోపాలు, తీర్థాలు, మెడలో మాలలు వేయడం లాంటివి చేస్తున్నారని ఆరోపణలు గుప్పించారు. అలాంటప్పుడు గుడికో గోమాత ఇలాంటి పథకాలు ఎవరికోసం చేస్తున్నారో టిటిడి పాలక మండలి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

పీఎం కిసాన్ ఈకేవైసీ తప్పనిసరి

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ

మండలంలోని పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకానికి మండలంలోని రైతులందరూ ఈకేవైసీ చేయించుకోవాలని ఏవో భారతి తెలిపారు. మూడో విడత పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద రైతులు లబ్ధి పొందేందుకు ఈఎల 15వ తేదీలోపు ఈకేవైసీ తప్పక పూర్తి చేసుకోవాలని సూచించారు. రైతులు ఈసేవా, కామన్ సర్వీస్ సెంటర్, ఆర్బీకే, సచివాలయాల్లో సంప్రదించాలని కోరారు.